VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 57

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 28 జూలై 2026

## ఎల్ నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కార్యక్రమాలు

● ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలి ● ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు






**అమరావతి,కలంకౌంటర్ :** ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు... రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు.. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీని నిమిత్తం క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ఏ ప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనేదానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరును చదివి వినిపించినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిన పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం

● ప్రధాని మోదీకి థింసా, కూచిపూడి నృత్యాలతో ఘన స్వాగతం ● ఉత్తరాంధ్రకు గర్వకారణంగా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయం ● ఏఎస్ఆర్ ఎయిర్ పోర్టుపై ప్రతీ ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం ● ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**అమరావతి,కలంకౌంటర్ :** ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్ట్ 1న ప్రారంభం అవుతున్న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్ర ప్రగతిలో కీలక మైలురాయి అవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో రాష్ట్ర విమానయాన రంగంలో నూతన శకం ప్రారంభం అవుతుందని సీఎం స్పష్టం చేశారు. ఆధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం ఈ ప్రాంతంలో ప్రయాణ సౌకర్యాలతో పాటు ఉపాధి, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం ఇస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రతో పాటు తెలుగు జాతికి గర్వకారణంగా మారనున్న విమానాశ్రయం ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. ప్రధాని మోదీకి గిరిజన సంప్రదాయ నృత్యం థింసా, కూచిపూడి నృత్యంతో స్వాగతం పలకాలని అధికారులకు సీఎం సూచించారు. గిన్నిస్ రికార్డు సృష్టించేలా ఎక్కువ మందితో థింసా నృత్య ప్రదర్శన ఉండాలని స్పష్టం చేశారు. అలాగే అరకు కాఫీ సహా స్థానిక పర్యాటకానికి బ్రాండింగ్ జరుగుతుందన్నారు.

**ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు విస్తృత ప్రచారం..** ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు థీమ్ తో విమానాశ్రయం గురించి ప్రతీ ఇంటా చర్చ జరిగేలా విస్తృత ప్రచారం జరగాలని.. మహిళలు, యువత, పాఠశాల విద్యార్థులు ఇలా వివిధ వర్గాలకు చేరువయ్యేలా వేర్వేరు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అవుట్ రీజ్ కార్యక్రమాలు, క్విజ్, ఉపన్యాస పోటీలు, ఫ్లాష్ మాబ్ లు, డ్రోన్ షోలను నిర్వహించాలన్నారు. స్థానిక పారిశ్రామిక వేత్తలతోనూ రౌండ్ టేబుల్ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు థీమ్‌తో 3-5కే రన్ లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారిని కూడా విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం జరిగేలా చూడాలని సూచించారు. మరోవైపు విమానాశ్రయం టెర్మినల్ భవనం ప్రారంభించిన అనంతరం ఇంధన, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖలకు చెందిన రూ.18 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని అధికారులు వివరించారు.

**2.30 గంటల పాటు భోగాపురంలో ప్రధాని పర్యటన..** ఆగస్టు 1 తేదీ ఉదయం 10.45 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు ప్రధాని మోదీ చేరుకుంటారు. విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబులు స్వాగతం పలకనున్నారు. 10.58 గంటలకు విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించనున్నారు. అనంతరం సీఎం, గవర్నర్ తదితరులతో కలిసి ప్రధాని మోదీ టెర్మినల్ భవనాన్ని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి బహిరంగ సభా వేదికకు ఓపెన్ టాప్ వాహనంలో ప్రయాణించనున్న ప్రధాని మోదీకి 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ గిరిజన థింసా నృత్యంతో ఘన స్వాగతం పలకనున్నారు. 11.30 నుంచి 12.55 గంటల వరకూ బహిరంగ సభలో పాల్గొని, అనంతరం ప్రధాని 1.10 గంటలకు ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు.

## పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు అభినందనీయం

● సామాన్యుడికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది ● బీపీటీ సూపర్ ఫైన్ కేజీ రూ.52, పచ్చి బియ్యం రూ.50లకు అందజేయడంతో సామాన్యుడికి ఊరట ● ఆగస్టు 1 నుంచి ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలి ● ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



**విజయవాడ, కలంకౌంటర్ :** 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినది. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యుడికి సాంత్వన చేకూర్చేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52లకు, గ్రేడ్ 1 పచ్చి బియ్యం ( రా రైస్ ) రూ.50లకు రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైసు మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు, సోదరులు శ్రీ నాదెండ్ల మనోహర్ గారు. సామాన్యుడిపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం స్వాగతించదగినదని చెప్పారు. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్ష చేసి, మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేలా మేలైన ధరలను నిర్ణయించారని ఉప ముఖ్యమంత్రివర్యులు తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థికభారాన్ని తగ్గిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

## విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయి.. ఫలితాలపై దృష్టిపెట్టాలి

● విద్యార్థులకు మార్కులు రాకపోతే సీఎం నా మార్కులు తగ్గిస్తారు ● కృష్ణా జిల్లా పునాదిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్ ● పాఠశాలలో వసతులు, విద్యా ప్రమాణాలపై ఆరా







**పునాదిపాడు,కలంకౌంటర్ :** విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యా యని, ఫలితాలపై దృష్టిపెట్టాలని అధికారులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, విద్యా ప్రమాణాలపై మంత్రి ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి 'ఏ' సెక్షన్ విద్యార్థులతో మంత్రి సంభాషించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మీ సీనియర్స్ కంటే మీరు బాగా చదవాలి. గతేడాది పదో తరగతిలో 67శాతం మంది విద్యార్థులు మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర సరాసరి కంటే ఇది 11 శాతం తక్కువ. మీకు మార్కులు రాకపోతే సీఎం చంద్రబాబునాయుడు గారు నా మార్కులు తగ్గిస్తారు. కాబట్టి మీరంతా బాగా చదవాలని వారిని ఉత్సాహపరిచారు.


**మీరు చేయాల్సిందల్లా బాగా చదవడమే..** విద్యార్థులకు పదో తరగతి చాలా ముఖ్యం. పది, ఇంటర్మీడియట్ చదివే సమయంలో నా జీవితంలో మార్పు వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఇప్పుడు మంచి మార్కులు వస్తేనే భవిష్యత్ బాగుంటుందని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ అందజేత, పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను మంత్రి ఆరా తీశారు. బాగుందని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. ప్రజాప్రభుత్వంలో మధ్యాహ్న భోజనానికి ఫైన్ రైస్ ను వినియోగిస్తున్నామని చెప్పారు. రాగి జావ ఎంతమందికి ఇష్టం, చిక్కీ ఎంతమందికి ఇష్టం అని మంత్రి సరదాగా ప్రశ్నించగా.... అధికశాతం మంది విద్యార్థులు చిక్కీ ఇష్టమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజా ప్రభుత్వం కృషిచేస్తోందని, అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందని, మీరు చేయాల్సిందల్లా బాగా చదవడమేనని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. చదువుకున్నది జీవితంలో ఎంతవరకు ఉపయోగపడుతు న్నదన్నది ముఖ్యం, లోకజ్ఞానం కూడా అవసరమేనని పేర్కొన్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

**అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసంతృప్తి..** గతేడాది కంటే ఈ ఏడాది 19 మంది విద్యార్థులు పాఠశాలలో కొత్తగా ప్రవేశాలు పొందారు. ఇందుకు పాఠశాల సిబ్బందిని మంత్రి అభినందించారు. మౌలిక సౌకర్యాల్లో పాఠశాల 2.76 రేటింగ్ సాధించింది. అయితే పాఠశాలలోని విద్యార్థులు అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసృతృప్తి వ్యక్తం చేశారు. అద్భుతమైన మౌలిక సౌకర్యాలు, మంచి ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ లెర్నింగ్ అవుట్ కమ్స్, సమ్మెటివ్, ఫార్మాటివ్ అసెస్ మెంట్స్ లో స్కూల్ వెనుకబడి ఉంది. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో 0.9శాతం రేటింగ్ సాధించింది. పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉన్న పాఠశాల అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉందని, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై ప్రత్యేక దృష్టిసారించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరు కావడాన్ని నివారించాలన్నారు. ఒకేషనల్ ల్యాబ్స్ పైనా దృష్టిసారించాలని ఆదేశించారు. ఇంటర్ లో ఒకేషనల్ కోర్సులపై దృష్టిసారించడం ద్వారా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.

**విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయి.. ఫలితాలపై దృష్టిపెట్టాలి..** పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విషయంలోనూ మంత్రి ఆరా తీశారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఫలితాల మెరుగుదలకు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలని, విద్యావ్యవస్థ బాగుండాలంటే సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ రెండూ ముఖ్యమేనని చెప్పారు. పదో తరగతి పరీక్షా ఫలితాల మెరుగుదలపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని, ఫలితాలపై దృష్టిపెట్టాలన్నారు. 340 మంది ఉన్న పాఠశాలలో మార్పు కనపడాలని, ఆ మార్పు ఫలితాల్లో ప్రతిబింబించాలని ఆదేశించారు. అనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రశ్నించారు. విద్యార్థులకు ఆటోగ్రాఫ్ లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.వెంకటేశ్వరరావు, ఆర్జేడీఎస్ నాగమణి, డీఈవో యూవీ సుబ్బారావు, ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు స్టీమ్ రైస్ అందేలా ఏర్పాట్లు

● రాష్ట్రంలో అమలుకు సన్నహాలు ● 1000 మీ మార్టుల ఏర్పాటుకు కేంద్రం సహకారం ● రేషన్ బియ్యం లో 10 శాతం నూకల బియ్యం ఉండేలా చర్యలు ● ఢిల్లీ పర్యటనలో పౌర సరఫరాల శాఖామాత్యులు ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులను కలిసిన రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్



**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చని, దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ చెప్పారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖామాత్యులు ప్రహ్లాద్ జోషి తో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్సీసీఎఫ్) ఎండీ శ్రీమతి అనీస్ జోసఫ్ గారిని కలిసి రాష్ట్రంలో 1000 "మీమార్టు" ల ఏర్పాటుపై తగిన సహకారం కోరుతూ ఎంఓయూ చేసుకున్నారు. అనంతరం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖా గారిని కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మనోహర్ సీఎంఆర్ సేకరణ, స్టీమ్ రైస్ పంపిణీ, మీ మార్టుల ప్రారంభం, రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతులు వంటి అనేక అంశాలను చర్చించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక పాయింట్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను చేపడుతున్నవిషయాన్ని కేంద్ర మంత్రివర్యుల వద్ద ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావల్సిన అనుమతులు, సహకారం, పెండింగ్ నిధుల విషయాలను ప్రత్యేకంగా మంత్రివర్యుల ముందుంచారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్టీమ్ రైస్ వాడకం ద్వారా అందుతున్న నాణ్యమైన భోజనంపై సానుకూలత ఉందని, దీన్ని ప్రజాపంపిణీ వ్యవస్థకు అనుసంధానం చేసి పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఒక జిల్లాలో మొదలుపెట్టేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రివర్యుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు. బియ్యం సంచులపై ఆర్ఎఫ్ఐడీ ను ముద్రించడం ద్వారా అక్రమ రవాణా అరికట్టడానికి దోహదపడుతుందని, దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యం లో 10 శాతం నూకల బియ్యం అందిస్తే, ప్రజా పంపిణీలో మంచి ఫలితాలు ఉంటాయని, దీన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే వివిధ అంశాలపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. మంత్రి వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు , పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, తదితరులు ఉన్నారు.

## హంద్రీనీవాతో కుప్పానికి జలకళ

● కుప్పంలో పర్యాటకరంగ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేకదృష్టి ● స్థానికంగా పరిశ్రమల రాకతో వేలాదిమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ● మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి- ఆర్థిక శక్తిగా ఎదగాలి ● కుప్పం నియెజకవర్గంలో నారా భువనేశ్వరి నాలుగు రోజుల పర్యటన ప్రారంభం

- 4లో



## టీడీపీ సీనియర్ కార్యకర్త బిళ్ల సత్యనారాయణను పరామర్శించిన మంత్రి లోకేష్

### కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని హామీ





**గోసాల,కలంకౌంటర్ :** కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా పెనమలూరు మండలం గోసాలలోని వేణుగోపాల స్వామి నగర్ లో నివాసం ఉంటున్న టీడీపీ సీనియర్ కార్యకర్త బిళ్ల సత్యనారాయణను పరామర్శించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో బిళ్ల సత్యనారాయణ పనిచేస్తున్నారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమానికి పసుపు రంగు చొక్కా ధరించి, తన ద్విచక్ర వాహనంపై టీడీపీ జెండాతో హాజరవుతూ గుర్తింపుపొందారు. గత మూడేళ్లుగా కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్నారు. చిన్న కిరాణషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అనారోగ్య సమస్యల కారణంగా మరణించగా.. చిన్న కుమార్తె ఇటీవల భర్తను కోల్పోయి తన పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లిన మంత్రి నారా లోకేష్.. బిళ్ల సత్యనారాయణ, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బిళ్ల సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, అన్ని విధాల అండగా ఉంటానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

## విద్యార్థిని శివాని మృతి తీవ్ర విచారం కలిగించింది : ముఖ్యమంత్రి చంద్రబాబు

**పోలవరం,కలంకౌంటర్ :** పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆ రోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవ్వడం నన్ను కలిచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవ్వరూ ఒత్తిడికి, నిరాశ, నిస్పృహలకులోను కావొద్దని కోరుతున్నాను. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధను, ఆవేదనను మీ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని, అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని తెలియజేస్తున్నాము.

## పునాదిపాడులో బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్






**పునాదిపాడు, కలంకౌంటర్ :** రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా కంకిపాడు మండలం పునాదిపాడులో పోలవరపు మాధవరావు, ఇతర కుటుంబ సభ్యుల విరాళం రూ.1.20 కోట్లు వెచ్చించి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలి కల జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల లేబరేటరీలను పరిశీలించారు. విద్యార్థులతో సంభాషించారు. బాగా చదువుకోవాలని వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు, పూర్వ విద్యార్థుల ను కలిసి అభినందించారు. దాసరి ఆళ్వార స్వామి రచించిన భారతదేశ ప్రధానమంత్రులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభా ష్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, ఇతర ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ డీకే బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

# పిఠాపురం నియోజక వర్గం అభివృద్ధి పనుల పురోగతిపై పవన్ కళ్యాణ్ సమీక్ష

● క్షేత్రస్థాయి పరిశీలనకు కార్యాలయ సిబ్బంది ● కొత్త రోడ్లు, నాగులపల్లి తాగునీటి సరఫరా పథకం అభివృద్ధిపై ఆరా ● అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించాలని స్పష్టీకరణ ● పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలు సూచనలు ● నియోజకవర్గంలో 100 భజన మందిరాల నిర్మాణానికి ప్రణాళికలు ● పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై వివరాలు కోరిన ఉప ముఖ్యమంత్రివర్యులు

**అమరావతి,కలంకౌంటర్ :** పిఠాపురం నియోజకవర్గంలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సేవల అమలు తీరుపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యాలయ సిబ్బందిని నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి పరిశీలనకు పంపారు. అంశాలవారీగా వారు సమర్పించిన నివేదికలను పరిశీలించారు. నియోజకవర్గవ్యాప్తంగా నూతనంగా నిర్మించిన రోడ్ల నాణ్యత, నాగులపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకం విస్తరణ పనులు, భజన మందిరాల నిర్మాణ పురోగతి, దేవాదాయ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై శాఖలవారీగా అధికారులు నుంచి వివరాలు తెలుసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గవ్యాప్తంగా రహదారులన్నీ అభివృద్ధి చేయాలన్న శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 288 సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. క్షేత్రస్థాయికి వెళ్లి - నిర్మించిన రోడ్ల నాణ్యతను పరిశీలించాలని నియోజకవర్గ పర్యటనలో ఉన్న కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు నిర్మించిన ప్రహరీ గోడల పనులను కూడా పరిశీలించాలని సూచించారు. యు.కొత్తపల్లి మండల పరిధిలో తాగునీటి సరఫరాకు కీలకమైన నాగులపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథక విస్తరణ పనులు పూర్తయ్యి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. త్వరలో చేపట్టబోయే పిఠాపురం పర్యటనలో ఈ పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా సన్నాహాలు చేయాలని స్పష్టం చేశారు. నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లు, ఫిల్టర్ బెడ్లు, సంపుల నిర్మాణానికి సంబంధించి సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. యు.కొత్తపల్లి మండలంలోని 52 ఆవాసాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించే లక్ష్యంతో ఈ తాగునీటి పథకం విస్తరణ పనులు చేపట్టారు.

**శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుపై పర్యవేక్షణ ..**

పిఠాపురం నియోజకవర్గవ్యాప్తంగా 191 పాఠశాలలు ఉండగా, సుమారు 18 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.




పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న ఆహార నాణ్యత ప్రమాణాలను కూటమి ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తోందని.. పథక నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని పేషీ సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన, పోషకాహారాన్ని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, గత పర్యటనలో పరిశీలించిన ఇందిరానగర్ డ్రెయిన్ అభివృద్ధి తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ, పరిశుభ్రత కార్యక్రమాల అమలులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా సహించబోమని హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని ఏరియా ఆసుపత్రుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, రోగులకు అందుతున్న సేవలు, 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పురోగతి తదితర అంశాలను సమీక్షించారు. సీజనల్ వ్యాధుల కాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న పిఠాపురంలోని ప్రధాన ఆలయాల్లో దేవాదాయ శాఖ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. ముఖ్యంగా టీటీడీ సౌజన్యంతో నిర్మించ తలపెట్టిన భజన మందిరాల ఏర్పాటు ప్రణాళికలను సమీక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 100 భజన మందిరాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, స్థల సేకరణ, ఆలయ కమిటీల ఏర్పాటు తదితర అంశాల్లో ఉన్న ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గంలో నెలకొన్న సాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత ఆధారంగా రైతులకు నీటి విడుదల క్యాలెండర్ రూపొందించి అందించాలని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు.

# కార్పొరేట్ కంటే ఎంజేపీ సీట్లకే డిమాండ్

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ● బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ● రాష్ట్రంలో కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు ● ఉత్తరాంధ్రలో, రాయలసీమలో అయిదేసి చొప్పున ప్రారంభం ● 6 బాలికల గురుకుల పాఠశాలలను జూనియల్ కళాశాలలుగా అప్ గ్రేడ్ : మంత్రి సవిత ● గిద్దలూరు బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రారంభం






**గిద్దలూరు,కలంకౌంటర్ :** బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. దీనిలో భాగంగా కొత్తగా పది బీసీ గురుకులాలను ప్రారంభించామని, ఆరు బాలిక గురుకుల పాఠశాలలను జూనియ-ర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాల సీట్లకు కార్పొరేట్ సీట్ల కంటే డిమాండ్ అధికంగా ఉందన్నారు. బీసీలు అధికంగా ఉన్న చోట గురుకులాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గిద్దలూ రు పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీతతో కలిసి మంత్రి సవిత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యతోనే సమాజాభివృద్ధి అని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అని అన్నారు. ముఖ్యంగా బీసీలు విద్యలో రాణిస్తే అన్ని రంగాల్లోనూ ముందంజ వేయగలరని ఆయన భావన అని అన్నారు. అందుకే, రాష్ట్ర వ్యాప్తంగా ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కొత్తగా పది బీసీ గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో వెనుకబడిన ఉత్తరాంధ్రలో అయిదు, రాయలసీమలో మరో అయిదు గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా గిద్దలూరులో ఎంజేపీ బాలుర గురు కుల పాఠశాలను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం తాత్కాలిక భవనం లో అన్ని మౌలిక సదుపాయలతో ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ను ఏర్పాటు చేశామన్నారు. రూ.50 కోట్లతో శాశ్వత భవన సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

**ఫలితాల్లో ఎంజేపీదే అగ్రస్థానం..** రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాల్లో విద్య బోధిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. అందుకే, కార్పొరేట్ విద్య సంస్థల సీట్ల కంటే ఎంజేపీ గురుకుల సీట్లకు అధిక డిమాండ్ ఉందని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ఇన్వర్టర్లు, పరిశుద్ధమైన తాగునీటికి ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దోమలు చొరబడకుండా దోమలు తెరలు తరగతి గదులు, విశ్రాంతి గదులు కిటికీలకు, తలుపులకు అమర్చుతున్నా మన్నారు. విద్యతో పాటు క్రీడలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ట్రాక్ షూట్లు, బూట్లు అందజేశామన్నారు. త్వరలో స్పోర్ట్స్ కిట్లు కూడా అందజేయనున్నామని తెలిపారు. ఈ ఏడాది మే నెలలో విడుదలైన టెన్త్, ఇంటర్ లో ఎంజేపీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి, అగ్రగామిగా నిలిచారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల షైనింగ్ స్టార్స్ పేరుతో కూడా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించిందని మంత్రి సవిత గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలు అందిపుచ్చుకుని, అత్యుత్తమంగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, గురుకుల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కు విశేష స్పందన 187 వినతులు స్వీకరణ, వినతుల పరిష్కారంలో ఆలస్యం సహించేది లేదు

● పెండింగ్ అర్జీలను వెంటనే డిస్పోజ్ చేయాలి ● రైతులకు ఎరువుల సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ --● స్పెషల్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలి ● ఎన్టీఆర్ జిల్లాకు పెట్టుబడులు, పరిశ్రమలు ఆకర్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి ● జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**విజయవాడ,కలంకౌంటర్ :** విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)' కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలపై వినతిపత్రాలు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 187 వినతులు అందగా, వాటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందిన 51 వినతులు నమోదయ్యాయి. అలాగే ఎం ఏ యు డి - 32, పోలీస్ -25, పంచాయతీరాజ్ - 18 వినతులు నమోదు కాగా, మిగిలిన శాఖలకు సంబంధించి ఏడు నుండి ఒకటి వరకు వినతులు నమోదు కావడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని నిర్దేశిత గడువులోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న వినతులను వెంటనే పరిశీలించి పరిష్కరించిన అనంతరం ఆన్‌లైన్‌లో డిస్పోజ్ చేయాలని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా ఆలస్యం సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు పిజిఆర్ఎస్ పోర్టల్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పెండింగ్‌లో ఉన్న వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ, భూ వివాదాలు, సర్వే సమస్యలు వంటి ప్రజలకు నేరుగా సంబంధించిన అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి గ్రీవెన్స్ నిర్దేశిత సమయపరిమితిలో పూర్తి కావడంతో పాటు, అర్జీదారునికి సంతృప్తికరమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలాల వారీగా నియమించబడిన స్పెషల్ అధికారులు ఆయా మండలాలను సందర్శించి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు, ప్రతికూల నివేదికలు రాకుండా చూడాలని, అవసరమైన ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పరిశ్రమలు స్థాపించాలనుకునే పారిశ్రామికవేత్తలకు జిల్లా పరిశ్రమల సమావేశం సమయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయించి, అనంతరం భూమి కేటాయింపునకు అవసరమైన దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియపై పూర్తి బాధ్యత సంబంధిత అధికారులదేనని పేర్కొంటూ, బుధవారం మధ్యాహ్నానికల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, పెట్టుబడిదారుల్లో ఇంకా కొంత సందిగ్ధత నెలకొని ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎంఎస్ఎంఈ సమావేశంలో అనేక మంది పారిశ్రామికవేత్తలు ఎక్కడ సంప్రదించాలి, ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశాలపై సందేహాలు వ్యక్తం చేశారని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు ఆకర్షించాలంటే సంబంధిత అధికారులందరికీ పెట్టుబడుల ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. కొత్తగా పరిశ్రమలు స్థాపించాలనుకునే వారిని, స్టార్టప్ వ్యవస్థాపకులను ప్రోత్సహించాలని, వారిని జీఎం-డీఐసీ లేదా సంబంధిత ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ అధికారులతో అనుసంధానించాలని ఆదేశించారు. పరిశ్రమలకు అందుబాటులో ఉన్న లేఅవుట్లు, ప్లాట్లు, భూముల వివరాలు ఎప్పటికప్పుడు ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పెట్టుబడుల పురోగతిపై ప్రతి వారం ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంతమంది పెట్టుబడిదారులు సంప్రదించారు, వారి అవసరాలు ఏమిటి, ఏ దశలో ప్రతిపాదనలు ఉన్నాయనే వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. విశాఖపట్నంలో కుదిరిన ఎంఓయూల ద్వారా ఎన్టీఆర్ జిల్లాకు పలు పరిశ్రమలు, టూరిజం ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని, వాటికి అవసరమైన అనుమతులను వేగంగా జారీ చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా అందుతున్న ఫిర్యాదులపై అధికారులు అత్యంత బాధ్యతతో స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత అధికారులు అర్జీదారులను స్వయంగా సంప్రదించి, వారి సమస్యలను తెలుసుకున్న అనంతరమే ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. అర్జీదారునితో మాట్లాడిన తేదీ, సమయాన్ని కూడా నివేదికలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. 1100 టోల్ ఫ్రీ సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఆ నంబర్‌కు వచ్చే ప్రతి కాల్‌కు సంబంధిత అధికారులు సరైన విధంగా స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహ, పీజీఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు నగరంలో వర్షపు నీటి పారుదల వ్యవస్థ బలోపేతానికి కేంద్రం నుంచి రూ.195 కోట్లకు పైగా మద్దతు -- రాజ్యసభలో ప్రశ్నించిన డా.. బీద మస్తాన్ రావు యాదవ్

**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లోని తీరప్రాంత పట్టణాల్లో వర్షపు నీటి పారుదల (స్టార్మ్ వాటర్ డ్రైనేజ్) వ్యవస్థ, వరదల నివారణ, డ్రైనేజ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ముఖ్యంగా నెల్లూరు నగరంలో చేపట్టిన చర్యలపై రాజ్యసభలో అడిగిన తన ప్రశ్నకు కేంద్ర గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ తోఖన్ సాహు సమగ్ర సమాధానం ఇచ్చినట్లు రాజ్యసభ సభ్యులు డా॥శ్రీ బీద మస్తాన్ రావు యాదవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సమాధానం ప్రకారం, వర్షపు నీటి నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలు మరియు పట్టణ స్థానిక సంస్థల (ULBs) పరిధిలోని అంశమైనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అమృత్ (ఆమృత్) మరియు అమృత్ 2.0 వంటి జాతీయ పథకాల ద్వారా రాష్ట్రాలకు ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందిస్తూ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నట్లు పేర్కొంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమృత్ పథకం కింద మొత్తం 14 స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ ప్రాజెక్టులు రూ.342.72 కోట్ల వ్యయంతో అమలవుతుండగా, వాటిలో నెల్లూరు నగరంలోనే రూ.82.02 కోట్ల విలువైన రెండు ప్రధాన డ్రైనేజ్ ప్రాజెక్టులు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా, అమృత్ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 99 పార్కులు మరియు హరిత ప్రదేశాల అభివృద్ధికి రూ.80.49 కోట్లు మంజూరు చేయగా, నెల్లూరులో మూడు ప్రాజెక్టులకు రూ.2.67 కోట్లు కేటాయించినట్లు తెలిపింది. అమృత్ 2.0 కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.485.94 కోట్ల వ్యయంతో 194 చెరువులు, నీటి వనరుల పునరుద్ధరణ పనులు చేపట్టగా, వాటిలో నెల్లూరు జిల్లాలో 12 నీటి వనరుల పునరుద్ధరణ ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అలాగే పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి (Urban Infrastructure Development Fund - UIDF) (ట్రాంచ్–II కింద నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.113 కోట్లు మంజూరు చేసి 97 కిలోమీటర్ల డ్రైనేజీ నిర్మాణం మరియు అనుబంధ పనులు చేపడుతున్నట్లు సమాధానంలో పేర్కొంది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ బీద మస్తాన్ రావు యాదవ్ మాట్లాడుతూ, ప్రతి వర్షాకాలంలో నెల్లూరు నగరంలోని అనేక ప్రాంతాలు నీట మునిగిపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని అన్నారు. వేగవంతమైన పట్టణీకరణ, తగిన డ్రైనేజీ వ్యవస్థల కొరత, డ్రైనేజీ మార్గాల ఆక్రమణలు, ఘన వ్యర్థాల నిర్వహణలో లోపాలు వంటి కారణాలతో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సమాధానంలో రాష్ట్రంలోని తీరప్రాంత నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థపై సమగ్ర అంచనా నిర్వహించి, డ్రైనేజీ లోపాలు, మిస్సింగ్ లింకులు, నీటి నిల్వ ప్రాంతాలు, అవుట్‌ఫాల్ అవసరాలు, దశలవారీ అభివృద్ధి చర్యలను గుర్తించినట్లు పేర్కొనడం సానుకూల పరిణామమని ఆయన అన్నారు. అలాగే వర్షాకాలానికి ముందే డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, పూడిక తొలగింపు, అడ్డంకుల తొలగింపు వంటి చర్యలు క్రమం తప్పకుండా చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని తెలిపారు. నెల్లూరు నగరాన్ని భవిష్యత్తులో వరదల నుంచి రక్షించే విధంగా ఆధునిక స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ వ్యవస్థను త్వరితగతిన పూర్తి చేయాలని, మంజూరైన నిధులను సకాలంలో వినియోగించి పనులను వేగవంతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మరియు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ శ్రీ బీద మస్తాన్ రావు యాదవ్ కోరారు. అదేవిధంగా, వాతావరణ మార్పుల ప్రభావంతో పెరుగుతున్న భారీ వర్షాల నేపథ్యంలో నెల్లూరుతో పాటు రాష్ట్రంలోని అన్ని తీరప్రాంత పట్టణాల్లో సమగ్ర పట్టణ వరద నిర్వహణ ప్రణాళికలను రూపొందించి, శాశ్వత డ్రైనేజీ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు సురక్షితమైన పట్టణ వాతావరణాన్ని కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సంత్ రవిదాస్ ఆశయాలే సామాజిక సమరసతకు మార్గం

- 650వ జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'సంత్ రవిదాస్ మహా అభియాన్'
- గురు పౌర్ణమి నుంచి రవిదాస్ జయంతి వరకు విస్తృత కార్యక్రమాలు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్

**విజయవాడ,కలంకౌంటర్ :** సమానత్వం, సామాజిక సమరసత, మానవతా విలువల స్థాపనకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సంత్ రవిదాస్ మహారాజ్ అని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి.వి.ఎన్. మాధవ్ పేర్కొన్నారు.బిజపి రాష్ట్ర కార్యాలయం లో సంత్ రవిదాస్ 650వ జయంతి ఉత్సవాల కార్యశాల సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న లి"సంత్ రవిదాస్ మహా అభియాన్"లిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా విస్తృత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సమావేశంలో బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్, జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గంగిరెడ్డి రాకేష్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేష్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనం శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ముని సుబ్రహ్మణ్యం, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడిసె దేవానంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.వి.ఎన్. మాధవ్ మాట్లాడుతూ, సుమారు 650 సంవత్సరాల క్రితం జన్మించిన సంత్ రవిదాస్ ప్రతి మనిషిలో ఒకే ఆత్మ, ఒకే దైవ చైతన్యం ఉందని బోధించారని అన్నారు. కులం, వర్ణం, మతం అనే భేదాలకు అతీతంగా



మానవత్వమే పరమ ధర్మమని ఆయన ప్రపంచానికి చాటి చెప్పారని పేర్కొన్నారు. 14వ శతాబ్దంలో విదేశీ దాడులు, బలవంతపు మత మార్పిడులు ఒకవైపు, సమాజంలో కుల వివక్ష, అంటరానితనం మరోవైపు తీవ్రంగా ఉన్న సమయంలో సంత్ రవిదాస్ సమానత్వ భావనను ప్రజల్లో నాటారని తెలిపారు. వివక్షను స్వయంగా అనుభవించినప్పటికీ ద్వేషాన్ని కాకుండా ప్రేమ, భక్తి, ఆధ్యాత్మికత, సామాజిక సమరసతనే తన జీవిత మార్గంగా ఎంచుకుని సమాజ సంస్కరణ కోసం కృషి చేశారని కొనియాడారు. సాధారణ ప్రజలకు అర్థమయ్యే భాషలో పద్యాలు, దోహాలు, భక్తి గీతాల ద్వారా సంత్ రవిదాస్ తన సందేశాన్ని విస్తృతంగా చాటారని పేర్కొన్నారు. ఆయన ఆధ్యాత్మిక గొప్పతనానికి నిదర్శనంగా సిక్కు మత పవిత్ర గ్రంథమైన గురు గ్రంథ్ సాహిబ్లో ఆయన రచించిన 41 దోహాలకు స్థానం లభించిందని గుర్తు చేశారు. సంత్ రవిదాస్ 650వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న "సంత్ రవిదాస్ మహా అభియాన్" గురు పౌర్ణమి నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే రవిదాస్ జయంతి వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కలశ యాత్రలు, సామాజిక సమరసత సమావేశాలు, పుస్తకావిష్కరణలు, లఘు చిత్రాల ప్రదర్శనలు, యువతకు అవగాహన కార్యక్రమాలు, గ్రామ స్థాయి చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంత్ రవిదాస్ బోధించిన సమానత్వం, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికీ చేర్చడమే ఈ అభియాన్ ప్రధాన లక్ష్యమని పి.వి.ఎన్. మాధవ్ పేర్కొన్నారు. కుల, వర్గ, మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి సామాజిక సమరసతను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# గాజువాకలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమానికి ఘన శ్రీకారం చుట్టిన పల్లా శ్రీనివాసరావు

- రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి గడపకు తీసుకెళ్లాలి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**విశాఖపట్నం,కలంకౌంటర్ :** ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి కుటుంబానికి చేరవేసే లక్ష్యంతో చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాక నియోజకవర్గంలోని 65వ వార్డు బీసీ రోడ్ పరిధిలో ఘనంగా శ్రీకారం చుట్టారు. ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. సభ అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లిన పల్లా శ్రీనివాసరావు ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, పేద కుటుంబాలకు అందించిన ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వ ప్రగతి నివేదికను అందజేస్తూ, వారి సూచనలు, సమస్యలను స్వయంగా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 40 రోజుల పాటు నిర్వహించే "2 ఏళ్ల నమ్మకం... అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విజయాలను



ప్రజలకు నేరుగా వివరించడం, లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడటం, వారి అభిప్రాయాలను నమోదు చేయడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడాలని, ప్రతి ఇంటి వద్ద సమయం కేటాయించి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రభుత్వం రూపొందించిన ప్రగతి నివేదికను ప్రజలకు అందించడంతో పాటు, అభివృద్ధి, సంక్షేమంపై రూపొందించిన ప్రచార వీడియోలను కూడా చూపించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, మిత్రపక్షాల సమన్వయంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పల్లా పిలుపునిచ్చారు. సూపర్–6 హామీల అమలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులకు అందుతున్న సంక్షేమ ఫలాలు, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గత ఐదేళ్ల విధ్వంసకర పాలనకు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, పారదర్శక పాలనకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రజల సమస్యలు, సూచనలను నమోదు చేసి వాటి పరిష్కారానికి పార్టీ, ప్రభుత్వం తరఫున కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రతి బూత్ పరిధిలోని ప్రతి ఇంటిని క్రమబద్ధంగా సందర్శిస్తూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావాలని, ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించాలని, మై టీడీపీ (వీఎణ్హా) యాప్ ద్వారా ప్రజల స్పందనను నమోదు చేస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని పల్లా సూచించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని, ప్రతి కార్యకర్త పార్టీ ప్రతినిధిగానే కాకుండా ప్రభుత్వం చేసిన మేలుకు రాయబారిగా పని చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి గాథను ప్రతి గడపకు చేరవేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు కిదారి శ్రావణ్ మరియు మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యతల గురించి అవగాహన కల్పించాలి

## రాష్ట్ర సేవికా సమితి అఖిల భారత కార్యకారిణి ప్రతినిధి మండలి సమావేశాలు

**హైదరాబాద్,కలంకౌంటర్ :** ఏ దేశ భవిష్యత్తు అయినా దాని జనాభాపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల, జనాభా అసమతుల్యత అనేది ఒక తీవ్రమైన, సున్నితమైన సమస్య. భారతదేశంలో జనాభాను నియంత్రించడానికి అనేక దశాబ్దాలుగా అమలు చేసిన వివిధ చర్యలు జనాభా పెరుగుదల రేటును గణనీయంగా తగ్గించాయి. అయితే, జనాభా కేవలం ఒక గణాంకం కాదు, అది ఒక సమాజం యొక్క గుర్తింపు. భారతదేశంలో పెరుగుతున్న జనాభా అసమతుల్యత దాని గుర్తింపును నాశనం చేయడమే కాకుండా దాని ఉనికికే ముప్పుగా పరిణమిస్తోంది. హిందూ జీవన తత్త్వస్ఫూర్తితో అభివృద్ధి చెందిన అన్ని మతాల పట్ల గౌరవం, వసుధైక కుటుంబం వంటి సద్గుణాలతో భారతదేశానికి గుర్తింపు ఉంది. ప్రధానమంత్రి ఆర్థిక సలహా కమిటీ ప్రకారం, 1951లో 84.68 శాతంగా ఉన్న హిందూ జనాభా 2015 నాటికి 78.06 శాతానికి తగ్గింది. ముస్లిం జనాభా 1950లో 9.84 శాతం నుండి 2015 నాటికి 14.09 శాతానికి పెరిగింది. ఇతర సమూహాలలో వృద్ధి నామమాత్రంగానే ఉంది. వివిధ వర్గాల జనాభా నిష్పత్తులలో వస్తున్న మార్పులను బట్టి చూస్తే, జనాభా నియంత్రణ విధానాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉన్నట్లు కనిపిస్తోంది. హిందూ జనాభా క్షీణించిన రాష్ట్రాలను చూడటం ద్వారా భవిష్యత్తును సులభంగా ఊహించవచ్చు. మొత్తం కాశ్మీర్ లోయ, బెంగాల్, బీహార్, కేరళలోని కొన్ని జిల్లాలు మరియు అస్సాంలోని ముస్లిం–మెజారిటీ జిల్లాలలో మత సామరస్యం కుప్పకూలింది. ఈ అసమతుల్యత అప్పటికే భారతదేశ సమగ్రతకు ముప్పుగా పరిణమించి, 1947లో భారతదేశ విభజనకు దారితీసింది. జనాభా అసమతుల్యత నిర్దిష్ట ప్రాంతాలలో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, భాష మరియు సామాజిక సామరస్యంపై ప్రభావం చూపుతుంది. భారతదేశ సరిహద్దు ప్రాంతాల్లోకి రోహింగ్యాలు మరియు బంగ్లాదేశీ–యుల అక్రమ చొరబాటు కూడా ఈ అసమతుల్యతకు ఒక ప్రధాన కారణం. ఇది స్థానిక పౌరుల ఉపాధి, భూమి మరియు సహజ వనరులపై ప్రభావం చూపుతుంది. జనాభా అసమతుల్యత అంతర్గత భద్రత, సార్వభౌమాధికారానికి ముప్పును పెంచుతుంది. అంతేకాకుండా, సంఖ్యాపరమైన ప్రభావాన్ని పెంచుకోవడానికి జరుగుతున్న ప్రయత్నాలు జనాభా అసమతుల్యతను మరింత పెంచుతున్నాయి. మతమార్పిడి మరియు లవ్ జిహాద్ కూడా జనాభా అసమతుల్యత నిష్పత్తిలో మార్పుకు కారణాలుగా పరిగణించబడుతున్నాయి. ఇది ఒక సున్నితమైన విషయం, దీని పరిష్కారం గురించి మనమందరం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఈ జనాభా అసమతుల్యత పట్ల హిందూ సమాజం కూడా మేల్కొనాలి. నేడు, ఉన్నత విద్యావంతులైన హిందూ యువత ఆర్థిక లాభం కోసం కుటుంబ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం, పిల్లల పెంపకం బాధ్యతలను తప్పించుకోవడం, పిల్లలు కనకపోవడం లేదా ఒక్క బిడ్డను మాత్రమే కనడం వంటి అనేక కారణాలు జనాభా క్షీణతకు



దోహదపడుతున్నాయి. అంతేకాకుండా, ప్రభుత్వ విధానాల కారణంగా కొన్ని వర్గాలు పిల్లల జననాన్ని తగ్గిస్తుండగా, మరికొన్ని వర్గాల వారు ఒకటి కంటే ఎక్కువసార్లు వివాహం చేసుకుని ఎక్కువ మంది పిల్లలను కంటున్నారు. ఇది కూడా జనాభా అసమతుల్యతకు ఒక కారణం. సమాజంలో కుల వివక్షను సృష్టించడం, మత మార్పిడులను ప్రోత్సహించడం, హిందువులుగా గుర్తించుకోవడానికి నిరాకరించడం, మాతృత్వాన్ని పురోగతికి అడ్డంకిగా భావించడం, "డింక్" కుటుంబం వంటివి కూడా జనాభా అసమతుల్యతకు దోహదపడే అంశాలు. నేడు భారతదేశం ఒక యువ దేశం. రాబోయే 50 ఏళ్లలో, ఈ జనాభా వృద్ధాప్యానికి చేరుకుంటుంది. పిల్లలు పుట్టకపోతే, భారతదేశ యువ జనాభా తగ్గిపోతుంది. నేటి యువతకు వారి వృద్ధాప్యంలో అండగా నిలిచే తరం లేకపోవడం కూడా సామాజిక వ్యవస్థ విచ్ఛిన్నానికి దారితీస్తుంది. దేశంలో పెరుగుతున్న క్రైస్తవ, ముస్లిం మత మార్పిడులు, లవ్ జిహాద్, చొరబాట్లను అత్యంత కఠినమైన చట్టాలు చేసి తక్షణమే అరికట్టాలని రాష్ట్ర సేవికా సమితి ప్రతినిధి మండలి ప్రభుత్వాన్ని కోరుతోంది. చొరబాట్లను నివారించడానికి సరిహద్దుల్లో కూడా తగిన ఏర్పాట్లు చేయాలి. విదేశీయుల అక్రమ ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించాలి. వారిని అడ్డుకోవడం, వారిని గుర్తించి, బహిష్కరించడం అన్ని ప్రభుత్వాలకు రాజ్యాంగపరమైన నైతిక బాధ్యత. సుప్రీంకోర్టుచే నియమించబడిన హజారికా కమిషన్ ఈశాన్య ప్రాంతంలో బంగ్లాదేశీయుల చొరబాటు ఫలితంగా 2047 నాటికి స్థానిక పౌరులు అల్పసంఖ్యాకులుగా మారిపోతారని స్పష్టంగా పేర్కొంది. హిందువుల పట్ల జిహాదీల దురాక్రమణ విధానం ఆ ప్రాంతాలలో అసమానతలను వేగంగా పెంచుతోంది. భవిష్యత్ సవాళ్ల గురించి మన భవిష్యత్ తరాలను మేల్కొల్పి, వారికి సరైన సమయంలో వివాహం, సంతానోత్పత్తి, సామాజిక బాధ్యతల గురించి అవగాహన కల్పించాలని రాష్ట్ర సేవికా సమితి సమాజానికి పిలుపునిస్తోంది. కుల లేదా వర్గ ఆధారిత రాజకీయాలకు బదులుగా, అన్ని వర్గాలలో విద్య, మహిళా సాధికారత మరియు ఆర్థికాభివృద్ధి ద్వారా సమాజాన్ని మేల్కొల్పి, సాధికారత కల్పిద్దాం. జనాభా అసమతుల్యతకు గల అన్ని కారణాలను గుర్తించి, ఈ తీవ్ర సంక్షోభం నుండి దేశాన్ని కాపాడటానికి చట్టపరమైన చర్యలు చేపట్టి, మన సామాజిక బాధ్యతలను నెరవేర్చాలి. భారతదేశంలో జనాభా అసమతుల్యత యొక్క కారణాలు మరియు పరిణామాలపై రాష్ట్ర సేవికా సమితి ప్రతినిధి మండలి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల కోసం ఏకరీతి జాతీయ జనాభా విధానాన్ని అమలు చేయాలని అన్ని రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలను కోరుతోంది. జనాభా అసమతుల్యత వల్ల తలెత్తే సమస్యలను తొలగించి, భారతదేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించే ఏకరీతి పౌర స్మృతిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఈ అఖిల భారత కార్యకారిణి మరియు ప్రతినిధి మండలి ప్రభుత్వాన్ని కోరుతోంది.

# ఇంటింటికీ జననాయకుడు ఎమ్మెల్యే ఇంటూరి..

- యువ పాలనలో కందుకూరు అంచనాలను మించిన ప్రగతి..
- పేదల కాలనీల్లో ఎమ్మెల్యే కు అపూర్వ స్వాగత సందడి!





**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గంలో గడిచిన రెండేళ్లలో అంచనాలకు మించిన అభివృద్ధి, సంక్షేమం అందించామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఉలవపాడు పంచాయతీలోని వరిగచేను ఎస్టీ కాలనీలో రెండేళ్ల నమ్మకం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగారు. కాలనీలోని అన్నీ ఇళ్లకు స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే, లబ్ధిదారులను పలకరిస్తూ సంక్షేమ ఫలాల అందజేతపై వివరాలు సేకరించారు.పథకాలు అందని వారికి అధికారుల ద్వారా అక్కడికక్కడే పరిష్కారం చూపిస్తూ, వృద్ధులను ఆత్మీయంగా పలకరిస్తూ సాయం కోరిన వారికి సొంతంగా ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా స్థానికులు కోరిన సిసి రోడ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల విన్నపాలను స్వయంగా నోట్ చేసుకున్న ఆయన, రాబోయే రెండేళ్లలో సమస్యలన్నింటినీ పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని వారికి భరోసానిచ్చారు.

# అబ్దుల్ కలాం కు నివాళులర్పించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్





**మంగళగిరి,కలంకౌంటర్ :** మాజీ రాష్ట్రపతి, భారతరత్న, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా మంగళగిరి టిడిపి కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి లతో కలిసి ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం దేశానికి చేసిన నిస్వార్ధ సేవలను కొనియాడారు. అబ్దుల్ కలాం ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు.

# శ్రీ రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం



**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణానికి చెందిన ఇంటూరి రమణయ్య స్థానిక వెల్డింగ్ షాపులో పనిచేస్తూ ప్రమాదవశాత్తు కాలుకు దెబ్బ తగిలి ఆపరేషన్ చేయించుకొని ప్రస్తుతం పనికి వెళ్లలేని స్థితిలో ఇంటి వద్దనే ఉంటున్నారు. వారి సంపాదనతోనే కుటుంబం గడుపుతున్నారు. ఇప్పుడు పనికి వెళ్లక ఇబ్బంది పడుతూ వాళ్ళ రెండో కుమారుడు ఇంటర్మీడియట్ కాలేజీ ఫీజు, పుస్తకముల కొరకు మమ్మల్ని సంప్రదించారు.వారి కుటుంబ పరిస్థితులను విచారించి సోమవారం తానికొండ ప్రవీణ్ ( శ్రీ వరసిద్ధి వినాయక ఫైర్ వర్క్స్ ఓగూరు), కోట వెంకటేశ్వర్లు(కెసిఆర్ ),యాదాల వెంకటేశ్వర్లు,విశ్వనాథుని సత్యనారాయణ (నాని),కాంద్రాతి వెంకట సుబ్బారావు,సమోసా శివ, భొమ్మిశెట్టి రామచంద్ర,ఓలేటి మోహన్ రామ్,సొసైటీ సభ్యురాలు,గోనుగుంట వేణుగోపాలరావు సహకారంతో అబ్బాయికి కాలేజీ ఫీజు చెల్లించి పుస్తకాలు అందజేయడం జరిగింది. విద్యార్థి తల్లిదండ్రులు దాతలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సేవారత్న రవ్వా శ్రీనివాసులు, సొసైటీ గౌరవ సలహాదారులు డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, సొసైటీ ఈ.సి.మెంబర్లు తాతా వెంకట నాగకార్తీక్ (బాంబే హాల్), కోట వెంకటేశ్వర్లు (కెసిఆర్ ), కోట కిషోర్,గాయత్రి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ గీతా శ్రీనివాసులు పాల్గొన్నారు.

